# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

పత్రికా ప్రకటన

సెప్టెంబర్ 15, 2020

**ప్రజాస్వామికవాది, ప్రజల శ్రేయోభిలాషీ స్వామి అగ్నివేష్ మరణానికి సంతాపం**

ప్రజాస్వామికవాది, ప్రజల శ్రేయోభిలాషీ స్వామి అగ్నివేష్ మరణం పట్ల ఆయన కుటుంబానికి, మిత్రులకు మా పార్టీ కేంద్ర కమిటీ సంతాపం తెలియజేస్తున్నది. 2020 సెప్టెంబర్ 11వ తేదీన 80 సంవత్సరాల వయసులో స్వామి అగ్నివేష్ మరణం దేశంలో కొనసాగుతున్న ప్రజాస్వామిక, ప్రగతిశీల, పీడిత జాతుల విముక్తి ఉద్యమాలకు, ప్రజాహిత సమాజం కోసం జరుగుతున్న ఉద్యమాలకు పెద్ద నష్టం. ఆయన దేశంలో వెట్టి చాకిరీ నిర్మూలన కోసం తుదివరకూ పోరాడారు. రాజ్యాంగబద్ధ హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా గొంతెత్తారు. విప్లవ ప్రజా సంఘాల సదస్సులు, మహాసభలలో అగ్నివేష్ చాలా సందర్భాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

2009 మధ్యలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ ప్రారంభించినప్పుడు నాటి కేంద్ర హోం మంత్రి చిదంబరం తమ ప్రభుత్వం తరఫున మా పార్టీతో చర్చలకు ఏర్పాటు చేయమని స్వామి అగ్నివేష్‌ను కోరాడు. అగ్నివేష్ వెంటనే అందుకు అంగీకరించారు. నాటి మా పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి కామ్రేడ్ చెరుకూరి రాజ్‌కుమార్ (ఆజాద్)తో ప్రత్యుత్తరాలు జరిపారు. ఇవి కొనసాగుతుండగానే ప్రభుత్వం తన అసలు ఉద్దేశ్యంతో బయటకు వచ్చింది. పాత్రికేయులు హేమచంద్ర పాండేతో కలిసి ప్రయాణిస్తున్న రాజ్‌కుమార్‌ను 2010 జులైలో వెంటాడుతూ మార్గమధ్యంలో అరెస్టు చేసి ఆదిలాబాదు అడవులలో బూటకపు ఎదురు కాల్పులలో కాల్చి చంపారు. ఇది అగ్నివేష్‌ను తీవ్రంగా కలిచివేస్తూ దిగ్భ్రమకు గురి చేసింది. చర్చలకు చొరవ చేసి 'నేరం చేసినట్టు'గా, చిదంబరం తనను మోసగించినట్టుగా భావిస్తున్నానని ఆ సందర్భంగా ఆయన ప్రకటించారు. ప్రజల హితం కోసం ఒక నిజమైన ప్రజాస్వామిక ప్రక్రియను కోరుకున్న అగ్నివేష్ కేంద్రప్రభుత్వ వైఖరికి బలిపశువయ్యారు.

వివిధ సందర్భాలలో అగ్నివేష్ దండకారణ్యానికి వెళ్లారు. 2011లో ఒక ఐఎఎస్ అధికారితో కలిసి తాడిమెట్ల గ్రామ ప్రజలను కలుసుకునేందుకు వెళుతున్న ఆయనపై ఆ సమయంలోని కోయ కమాండోలు, సల్వాజుడుం గూండాలు వారి కుటుంబాలతో కలిసి దాడి చేశారు. దక్షిణ బస్తర్‌లోని తాడిమెట్ల ప్రాంతంలో మూడు ఆదివాసీ గ్రామాలకు చెందిన 250కి పైగా ఆదివాసీ రైతుల ఇళ్లను పోలీసులు కాలబెట్టిన పిదప ఆ కుటుంబాలకు అత్యవసర సరుకులు అందించడం కోసం అగ్నివేష్ అధికారి వెంట వెళుతున్నాడు. రైతుల ఇండ్లు తగలపెట్టిన చర్యకు గెరిల్లాలే కారణమంటూ నాటి బస్తర్ ఐజీ ఎస్ఆర్‌పి కల్లూరి ఆరోపించాడు. అదే సంవత్సరంలో తూర్పు బస్తర్‌లో తమపై నిరంతరం దాడులకు పాల్పడుతున్న ఐదుగురు పోలీసులను గెరిల్లాలతో కలిసి ప్రజా మిలీషియా 'ఎత్తుకు'పోయింది. ఆ తరువాత పోలీసుల కోరికపై వారిని గెరిల్లాల నుండి విడిపించడానికి మానవతా దృష్టితో అగ్నివేష్ మరి కొందరు ప్రజల మిత్రులతో కలిసి అక్కడకు వెళ్లి పోలీసులను విడుదల చేయాలని గెరిల్లాలను కోరి విడిపించుకుపోయారు.

జార్ఖండ్‌లో స్థానిక ఆదివాసీ ప్రజలు ఒక కార్యక్రమం కోసం అగ్నివేష్‌ను ఆహ్వానించినప్పుడు 2017లో ఆయన పాకుల్ వెళ్లారు. అప్పటికి దేశ వ్యాపితంగా, ఆ రాష్ట్రంలోనూ మూక హత్యలు జరుగుతున్నాయి. ఒక ప్రజాస్వామికవాది రాకను ఇష్టపడని కాషాయ మూకలు ఆయనపై నిస్సిగ్గుగా దాడి చేశాయి.

దేశంలో బ్రాహ్మణీయ హిందుత్వ శక్తుల శాసనం రాజ్యం ఏలుతున్న నేటి కాలంలో స్వామి అగ్నివేష్ అస్తమయం ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమానికి నష్టం. అగ్నివేష్ స్ఫూర్తితో దేశంలో ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమంలో భాగం కావాల్సిందిగా మా పార్టీ కేంద్ర కమిటీ సమస్త ప్రజాస్వామికవాదులకు, ప్రగతిశీల వ్యక్తులకు, ప్రజల శ్రేయోభిలాషులకూ విజ్ఞప్తి చేస్తున్నది.

Abhay

**అభయ్, అధికార ప్రతినిధి,**
**కేంద్ర కమిటీ**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**